నా మహారాష్ట్ర యాత్ర

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

బస్సువాలకం బహుచిత్రముగానున్నది. అది యీనాటిదికాదని వెంటనే గుర్తించితిని. ధర్మరాజాదులవారి రాజసూయయాగమును చూచుటకై బయలుదేరిన కొంతమంది పెద్దమనుష్యులు ఒకబస్సుమీద ప్రయాణంసాగించి, తిరిగివచ్చునపుడు అది భంగపెట్టుటచే నాసికలో దానిని వదలినట్లును, అదియే నేటి మాపయనమునకై ఉపయోగింపబడుచున్నట్లును ఊహింపగలిగితిని. తూకముగలవ్యక్తులు నలుగురు కూర్చున్నయెడల అది విఱిగి ముక్కలగుననియు, మధ్యమార్గమున మమ్మిది యేగోతిలోనో కూల్చివేయుననియు అడలుచు బిక్కుబిక్కుమనుచునే అందు ప్రవేశించితిని. ఈరీతి బస్సులు ఉత్తరహిందూస్థానములో- ముఖ్యముగా లాహోరు అమృతసరములకు నడుమ- విరివిగా లభించును. నేను ప్రవేశించునప్పటికే బస్సులో మహాశయు లెండఱో పెద్దపెద్దదుప్పట్లు కప్పుకొని కూర్చునియుండిరి. వాలకములనుబట్టి చూడగా వారంతా పోరంబోకు సరుకులోనివారివలె తోచిరి. వారు కప్పుకొనిన దుప్పట్లుకూడ ద్వాపరయుగంలోనివలె నగపడినవి. నన్ను చూచి పాపము కొంతచోటిచ్చిరి. నాసికకు తాళమువేసినగాని కూర్చుండుట సాధ్యముకాదని గ్రహించి, ఊపిరిబిగబట్టి ఒకప్రక్క జతికిలపడితిని. పెద్దపాగాధరించిన చిన్నమనిషియొకడు చాలసేపు నన్ను తేఱిచూచి "భాయీసాబ్! Where did you come from?" అని ప్రశ్నించినాడు. బస్సులోని బడుద్ధాయిలలో నెవ్వరికైన ఇంగ్లీషు వచ్చియుండునని నేను తలచియుండలేదు. హిందీతో ఇంగ్లీషును మిశాయించిన మహాశయుడొకడు నన్నట్లు ప్రశ్నింపగనే "గోదావరి సాగరమున కలియుచోటున కనతిదూరము నుండి" అని ఇంగ్లీషులో Peraphrasis అలంకారము ఉపయోగించి వడిగా నుత్తరమిచ్చితిని. దానితో అతడు ఉక్కిరిబిక్కిరియైనాడు. ఇంగ్లీషుతో నోరువిప్పుట తప్పనిగ్రహించి అతడు హిందీలో ధోరణి మొదలుపెట్టినాడు. నాస్వస్థలము రాజమండ్రి అని యెఱిగినాడు. మహారాష్ట్రులకు ముఖ్యముగా, నందలి గోదావరితీరవాసులకు రాజమండ్రి పరిచితమైనప్రదేశము. ఆవ్యక్తి నాగపురములో నేదోయుద్యోగము చేయుచున్నాడు. వానిసొంతయూరు నాసికము. సెలవుదీసికొని, యిపుడింటికి మరలుచున్నాడు. డిశంబరులో నాగపురమున మారిస్ కాలేజీ స్వర్ణోత్సవసందర్భమున రాధాకృష్ణుడొసగిన మహోపన్యాసమును వింటినని ఆతడు పలికినాడు. ఇంతలో నెవ్వరో బస్సుకడకు నడచివచ్చి, లోనివారిని తేఱిచూడ దొడగినాడు. నాసమీపమునగూర్చున్న నాగపూరుమిత్రుడు మెల్లగా "మీదేయూరని అతడడిగినయెడల నాసికయనియే చెప్పుము. లేకున్న మీసామానును పరికించి కొంతపన్ను యిమ్మంటాడు" అని నాతో చెప్పినాడు. కాశ్మీరము, రాజస్థానము మున్నగుచోటులకు పోయినపుడిట్టిపరీక్షలు జరుగుచుంట నెఱుగుదును. 'నాది నాసిక' యని వానితో నెట్లు తెలుపుదును? అమాంతముగా అబద్ధమాడుట నాకిష్టంలేదు. చదివినది ప్లీడరీవృత్తికైనా, జగదీశుడు అందులో రాదుచేఱనీయక అంగుండి నన్నుతొలగించి నేనెంత యత్నించుచున్నను నన్ను మరల నందులో ప్రవేశింపనీయకున్నాడు. ఆహా! మంచి లాయరునైనయెడల, న్యాయవాదవృత్తికి మంగళసూత్రమును కట్టియున్నయెడల, అబద్ధమాడుటకు అంత తటపటాయించియుందునా? అయినను అప్పటిలో నాకడనున్న సామానుమాత్రమెంత? స్నానమునకు పనికివచ్చు గుడ్డలేకదా నాకడనున్నవి! వానికి పన్ను తగులబడియగుచో, మాట్లాడక రెండు తువాళ్లు నాపెద్దమనిషికి సమర్పించవలెనని నిశ్చయించితిని. తొందరపడి "నాది నాసికయే" అని చెప్పదలచుకొనలేదు. కాని నేనుకూడ మహారాష్ట్రుడనని అపో

హపడి నన్నేమియు ప్రశ్నింపక ఆవ్యక్తి అందుండి తరలిపోయినాడు. బస్సు కదలినది. ఏముహూర్తమున ఊడి క్రిందబడుదుమో అని యడలి, బస్సు శబ్దము వికృతమై వినబడినపుడు "హరహరా" అనుకొనుచు, మరల విపత్తురాకుండుటకై వేయిదేవుళ్లకు మ్రొక్కుచు నిమిషములు లెక్కింపసాగితిని. చలిగాలి రివ్వురివ్వున వీవదొడగినది. నాసిక ఐదుమైళ్లదూరమందే యుండుటచే (బస్సు యేరకంవారిదియైనను) అచిరములో నచట జేరుకొంటిమి. పైక మంతకుమున్నే చెల్లించితిని కావున అందఱితో బస్సునుండి దిగితిని.

చలి దురంతమై, దుస్సహమై యుండెను. ఇంకను రాత్రి సాగుచునేయున్నది. నాటినిశీథము నాయెడల పగబూనినదేమో అని యూహించితిని. నాసిక నుండి త్రియంబకమునకు పోవుబస్సు పగలు ఎనిమిది గంటలు దాటినపిదపగాని బయలుదేరదని వినియుంటిని. అప్పటివఱకు కాలక్షేపము చేయుటెందు? బొంబాయిలో ఏముహూర్తమున రైలెక్కితినో, త్రోవపొడుగునను చిక్కులే పడుచుంటిని. నిమిషమైనను ఎందును ఒరగలేనైతిని. సన్యాసిరోగమువంటి మాబస్సు మార్గమధ్యమందే ప్రభాతమును చూచునని ఆశపడితిని. నిద్దరకు నీరువదలి, తెరువున నిలిచి యెంత సేపు చలితో పోరు సలుపవలెనో యెఱుగనైతిని.

సమయసమయములందు నిద్రాహారములకు స్వస్తి చెప్పి, యిక్కట్టులతో పోరు సలుపవలయు తరుణములు నాకెన్నో లభించినవి. తొలుత దేశాటనమునకై బయల్దేరి కలకత్తాలో ప్రవేశించినపుడు అనుదినము నాకీతరుణములు ప్రత్యక్షమగుచుండెడివి. బాలకుడనై కలకత్తాలో బౌబజారు హైస్కూలులో చదువుతఱి, తప్పనిసరిగ ఆత్మసంయమమును అభ్యసించుటకై పాటుపడవలసివచ్చెను. కొంత పైక మార్జించి చదువుకొనవలసివచ్చెను. విశ్రాంతిగాని, నిద్రగాని, యిష్టమైన ఆహారముగాని నాకంతగా లభించెడిదికాదు. అప్పుడు కలకత్తాలో తెలుగువారిసంఖ్య అంతగాలేదు. తెలుగు తిండిలేదు. భోజనమునకై ౨౧ ఈడెన్ హాస్పిటల్ రోడ్డులో గల పంజాబీ హోటలులో ప్రవేశించితిని. అచ్చట లభించెడిది రొట్టె. అంతకుమున్ను రొట్టెతినుటకు అభ్యాసములేనందున అచ్చటి ఉప్పుకారములులేని క్రొత్త తిండి నాకు సొక్కెడిదికాదు. ఆ సమయములో నాజీవనముపై కన్నుంచిన ఆంధ్రు లిద్దఱుండిరి. వీరు బ్రాహ్మణేతరులు: రేకపల్లి వీరాస్వామి, చోడిసెట్టి వీరరాఘవులు అనువారు. వీరు కలకత్తాలో వర్తకము చేయుచుండువారు. నాకును వీరికిని సఖ్యము కుదిరినది. వీరాస్వామి అప్పటికే మిగుల వృద్ధుడు. అప్పటికి ముప్పదియైదేండ్లకుమున్నే అతడు కలకత్తాలో చేరుకొన్నాడు. కాకినాడనుండి గోదావరి లంక పొగాకును తెప్పించి, కలకత్తాలో చుట్టలు చుట్టించి గ్లేస్గో మున్నగు పోటులకు ఎగుమతిచేయువాడు. ఈతని కింగ్లీషురాదు. బంగాళమును, హిందీని, అక్కరైనపుడు తెలుగును కలిపి 'చక చక' మాట్లాడువాడు. అట్టిగ్రామ్యమునకు వ్యాకరణ మక్కఱలేదనుకొన్నాడు. మనిషి మంచివాడు. మంచిభక్తుడు. సన్యాసులపై నెంతో ప్రీతిగలవాడు. ఎందఱెందఱో కపట సన్యాసు లీయమాయకుని జేరి ఏమేమో మంత్రము లుచ్చరించి డబ్బు దోచుకొని పోవువారు. ఒక సన్యాసి "నిన్ను బ్రాహ్మణుని చేతు"నని చెప్పియేమేమో మంత్రములుచ్చరించి అతని మెడలో నొకజందెము వేసినాడు. అబద్ధపు జందెమైననేమి, దానిని మెడదాల్చి తన జన్మ పవిత్రమైనదని వీరాస్వామి యెంచువాడు. పుణ్యదినములందు తప్పక ఉపవాసములు సలుపుచు, మత్స్యమాంసములను వర్జించి మిగుల నిష్ఠాపరుడై యుండువాడు. అపుడపుడు హోమములు సలుపుచుండువాడు. అనుదినము ౫౦ ప్రిన్సెప్ వీధినుండి అచటికి రమారమి రెండుమైళ్ళదూరమందున్న చాంద్‌పాల్ ఘట్టమునకు స్నానమునకై పోవుచు నన్ను కూడ గొంపోవువాడు. కలకత్తాలో తొలుత నన్ను జూచిన తెలుగువాడీతడే! తన యింట్లో బసచేయుమని నన్ను కోరినాడు. వీనికింగ్లీషురానందున, ఈతని వర్తకమునకు సంబంధించిన ఉత్తరములను నేనే వ్రాసిపెట్టుచుండువాడను. మాసమాసము నాకు కొంతప్రతిఫలం యిచ్చువాడు. తనతో గంగాస్నానమునకు గొంపోవువాడు. ఉపవాసములందును, జాగరణములందును తనతో పాల్గొనుడని ప్రోత్సహించువాడు. నాచే భారతభాగవతములు చదివించి,

వినుచుండువాడు. వీరరాఘవుని మకాము మలంగావేక్‌లో. అతని యంగడి ఆరవనెంబరు చాందినీచౌక్‌లో నుండెడిది. ఇతని తండ్రి నాగయ్య, కాకినాడ కాపురస్థుడు. వీరాస్వామికంటె ముందుగనే కలకత్తాపోయి వర్తకము మొదలిడినాడు. తొలుత కొంతకాలము వీరాస్వామి యితనికడ పనిచేసి, పదంపడి సొంతవర్తకము స్థాపించుకొన్నాడు. వీరరాఘవులు కలకత్తాలో పుట్టి, అందే పెరిగినాడు. బంగాళమునే చదువుట, వ్రాయుట నేర్చినాడు. తెలుగు వ్రాయ తెలియడు. వర్తకమును తానే చూచుకొనుచుండువాడు. తెలుగు ఉత్తరములను నాచే వ్రాయించుకొనుచుండువాడు. వీరాస్వామివలె స్వదేశపుచుట్టలను ఎగుమతిచేసి, ఆతనికంటె విరివిగా విదేశమునుండి వివిధములైన సిగరెట్లను తెప్పించి పెద్ద వర్తకము జేయుచుండువాడు. జావాచుట్టలను వాడువాడు. అప్పటికే షార్ట్‌హేండ్ టైప్‌రైటింగుల నెఱుగుదును కావున అక్కడఁగునపు డితనికి ఉత్తరములు టైప్‌చేసి యిచ్చువాడను. ఇతడుకూడ ప్రతిమాసము నాకు కొంత పైక మిచ్చుచుండువాడు. వీరాస్వామి, వీరరాఘవులతో గల సంబంధము కలకత్తాలో నావిద్యార్థి జీవనమందించుక భాగమును కడపి తరువాతి చదువునకు వలసిన వ్యవస్థను అన్యుల సంపర్కమువలన స్థాపించుకొనగలిగితిని. పిన్నతనమునుండి వివిధరాష్ట్రములందలి ప్రజలను పఠించుతరుణములు నాకెన్నో లభించినవి. ఆంధ్రులందు బ్రాహ్మణబ్రాహ్మణేతరుల సెంపటినో పఠించితిని. వారియెడల నాకు సమానగౌరవభావము కలదు. నా బ్రాహ్మణేతరమిత్రు లంతగా చదువుకొనినవారు కారు. కావున వీరు తమ గుండెలను భూమిలో పూడ్చిపెట్టలేదు. తోడి బ్రాహ్మణులు, తోడిబంధువులు నిర్దయులై నన్ను భ్రష్టునిజేసి దేశాటనమునకై పుత్తెంచినపుడు, నన్ను దగ్గరకు దీసికొని, నాకాదరానురాగము లొసగి, నాచేయుపని నానందముతో గైకొని నా కెంతేని సాయముచేసి, నన్ను కాపాడినవారు బ్రాహ్మణేతర సోదరులే! జాతినిబట్టిగాక గుణమును బట్టియే మనుష్యమహత్త్వమును గుర్తింపవలెనని నాడే గ్రహించితిని. వీరాస్వామి - వీరరాఘవుల గురు గుణములు నాకపుడు మేలుబంతులైనవి. ఉపవాసములును, జాగరణములును వీరాస్వామివల్లనే నాకు పట్టుబడినవి. వీరాస్వామి, వీరరాఘవులు నేడిహజగతియందు లేరు. వీరి పవిత్రాత్మలకు సచ్చిదానందముల నొసగుటకై సదా నే నీశ్వరుని ప్రార్థించుచుందును.

నా పరిశ్రమను పరికించుచు ఆదినములలో వీరాస్వామి నన్నుద్దేశించి, "అర్జునునివలె నిద్రను, లక్ష్మణునివలె ఆహారమును మీరు జయించినారు" అనుచుండువాడు. ఈ ప్రశంసకు నేను తగనుగాని, కలకత్తా చేరినపిదప నిద్రాహారములను హద్దులో నుంపగలిగితిననియు, నిక్కట్టు లొక్కుమ్మడి మూరొక్కనినపుడు దృఢచిత్తుడనై నిలువగలననియు నమ్ముచుందును. నాడే కాదు నేడుకూడ దురంతదురితోత్కట బాధలు పైబడి నాగుండెలను గుండజేయ గమకింప, వానిని కాపాడుచున్న దీ యాత్మవిశ్వాసమే!

నాసికలో నాడు తలదాచుకొనుటకు చోటు లేక పడినయిబ్బందిని నే నంతగా పాటింపలేదు గాని నా యాత్మవిశ్వాసమును కఠోరపరీక్షకు గుఱిగావించిన పరిస్థితులు ఈ మహారాష్ట్రయాత్రలో గూడ నన్నెదుర్కొనినవని తెలుపుదును. క్రూరమృగములతో నిండిన సాంద్రవనములందు నేను కొన్నిరాత్రులు గడపవలసి వచ్చెను. చదువగు లీయుదంతమును కాలక్రమమున నెఱుగగలరు. అ తరంగమందలి జిజ్ఞాసను వృద్ధిజేసి, భయ సంశయములను పోనాడి దుర్వ్యామర్శనలను, విషాక్తములైన పరిహాసములను పాటింపక మనుష్యహృదయమున నపూర్వశక్తిని జనింపజేయునది ఆత్మవిశ్వాసమని తెలుపుట నాయాశయము.

బస్సునుండి దిగినంతనే నాగపూరువ్యక్తి మఱి నాతో మాట్లాడక మెల్లగా నిష్క్రమింప దొడగినాడు. నాసిక ఆతని స్వస్థలము. అందు సొంత గృహముగల అదృష్టవంతుడు. బస్సులో నిష్టాగోష్ఠి నాతో కాలక్షేపము చేసిన పెద్దమనిషి, రాత్రిసమయముగనుక తనయింట విందారగింపబోవువాడనుగానని, ఉదయమే లేచి త్రియంబకము పోవువాడనని యెఱిగిన బుద్ధిమంతుడు,

అప్పటికప్పుడే రాత్రి చాల కడచిపోయినందున మిగిలిన భాగమున చలినుండి నన్ను కాపాడుటకై పరుండుటకై నాకు కొంతచోటిచ్చిన తన కపుడెంతో పుణ్యము లభించు నని యూహింపజాలు బుద్ధిశాలి. దురంతమైన చలిచే నేను వడకుచుండ నప్పటి నాదుస్థితిని గ్రహింపగల విద్యాధికుడు. కాని ఆత డేమియు పలుకక, మెల్లగ తనదారి దాను బట్టుచున్నాడు. "మీకూడవచ్చి, తెల్లవారువఱకు అందుండు" నని ఆమొద్దురాచ్చిప్పతో నెట్లు పలుకుదును? "ఏయరుగుమీదైన నించుక చోటు లభించినయెడల, కొంచెము నేపందు విశ్రమించి ధన్యుడనైతి ననుకొందును" అని మాత్రము రెండడుగులు ముందులకువైచి ఆతనికి వినబడున ట్లంటిని. "ఇచ్చట అరుగులేమీయుండవు" అని సెలవిచ్చి అతడు దాటినాడు. నాబల్లు మండఃకొనిపోయినది. చోటునకై నేనంత పరితపించలేదు. కాని యిట్టికఠినచిత్తుని గాంచితినని ఖేదపడితిని. విద్యాధికునియందు నిష్ఠురమైన అట్టి యుదాసీనభావమును గాంచినంతనే నా ఖేదమున కాగ్రహము తోడైనది. కొంత దూరమువఱకు సాగిపోయిన ఆవ్యక్తిని కేకవేసి, నిలిచినంతనే వానిని సమీపించి, "ఏపుణ్యభూమి పరార్థజీవియైన శివాజీని, దేశహితార్థము మహాత్యాగ మొనరించిన లోకమాన్యతిలక్‌ను, మహనీయగుణగరిష్ఠుడైన గోఖలేను కని జగత్ప్రసిద్ధి నందినదో, అట్టిమహారాష్ట్రము నేడును మహాత్ముల కాలవాలమైయున్నదని ఆశపడితిని. మీదర్శనము నాకు నిక్కముగ నాశాభంగము కలిగించినది. ఇక నిం కెట్టివింతమానవులు నాకనులబడుదురో! ఇక తమత్రోవను తాము పొండు. నేనీపథమందే నిలిచియుండి మీపై శాపవృష్టి గురిపింపనుగాని నేటియనుభవమును హృదయంగమ మొనరించుకొందును. మీకు సంపూర్ణమైన ఆంతరంగిక పరివర్తనము కలుగుగాకని ఈశ్వరుని వేడుకొందును." అని పలికి మరలితిని. ఆత డేమియు మాట్లాడక తనదారిని తాను పోయినాడు.

ఈ మహారాష్ట్రుని బోలువ్యక్తి యొకడు హిమగిరియాత్రయం దేడేండ్లకుమున్ను నాకు ప్రత్యక్షమైనాడు. నాటియుదంతము నీసందర్భమున సంక్షేపముగ తెలుపుట అప్రస్తుతము కాదని నాతలంపు.

ఒకానొక హిమగిరియా లో నాకు గమ్యస్థానమైనది శ్రీనగరము. అచటికి పోవుటకు రెండుమార్గము లున్నవి. అవి జమ్మూ, రావల్పిండిపథములు. ఫ్రాంటియర్ మేలులో పోయి వజీరాబాద్‌లో దిగి, అందుండి కాశ్మీరరాజుయొక్క గ్రీష్మావాసమైన జమ్మూకు పోయి, అందుండి బస్సుద్వారా శ్రీనగరమునకు పోవచ్చును. కాని, యీత్రోవ బహుళములైన అపాయములతో నిండియుండును. మహోన్నత స్థలములనుండి పాతాళమునంటు లోయలలోనికి దిగి, అందుండి మరల పై కెగబ్రాకి మరల నొకగభీరోపత్యకయొక్కయంచునుండి హిమగిరియాత్రయందు బస్సుపోవును. లోయలోనికి దిగుబస్సు వెనుక నెత్తైనచోటునుండి వచ్చుబస్సులోనివారికి ఒక్కొకపుడు కానుపించదు. బస్సుకంటె ప్లెజర్‌కార్ వేగముగ పోవును గావున పెక్కువిపత్తులకు గుఱియగుచుండును. కావున పలువురు ధనికులుకూడ బస్సునే ఆశ్రయించుచుందురు. అచ్చటి డ్రైవరులు మిగుల నేర్పరులు. ఇంచుక యజాగ్రత పొడసూపినయెడల, బస్సు ఢభాలున లోతులోయలోపడి పిండిపిండియగును! అందలివారు నిముసములో గుండయగుదురు! కాశ్మీరరాజు విశేషధనము వెచ్చించి జమ్మూనుండియు, రావల్పిండినుండియు శ్రీనగరమునకు రోడ్డులు వేయించినాడు కాని పర్వతప్రదేశమందలి తెన్నులు సరియైనవి కాక ఉపద్రవములతో నిండియుండును. ఏపిల్పువర్తకమునకు రావల్పిండి మార్గము అనుకూలమైనది. అందును అపాయములు జరుగుచుండునుగాని జమ్మూపథమందలి ఆపదలకంటెనివి తక్కువయైనవి. రావల్పిండినుండి శ్రీనగరము సుమారు రెండువందలమైళ్ల దూరమందున్నది. ఈ మార్గముగుండా నేను కాశ్మీరమునకు పోవ నిశ్చయించితిని.

౧౯౨౯ లో లాహోరులో జరిగిన కాంగ్రెసునకు రాజస్థానమునుండి పోయి, అందుండి హిమగిరియాత్ర సలుప నుద్దేశించితిని. లాహోరు కాంగ్రెసునకు కొంది

ఆంధ్రులు వచ్చిరి. తొలుత నేను "రాజస్థానయువ సమాజము" యొక్క డేరాలో బసచేసితిని. ఒక బందరు ఆంధ్రసోదరుడు * నాకు కనుపించి తెలుగుల డేరాలోనికి రమ్మని నన్నాహ్వానించినాడు. కలకత్తాను వీడి శారదతోగూడ పెక్కునెలలు రాజస్థానమున పర్యటన మొనరించుచుండుటచే, నాటివఱకు నాకు తెలుగుమొగము కనుపించలేదు; తెలుగుమాట చెవిబడ లేదు. అందుచే రాజస్థాన మిత్రులతో నేదో సర్దిచెప్పి నే నాంధ్రులడేరాలో ప్రవేశించితిని. నాతో నాపొట్టిపిచికి యున్నాడు. నెల్లూరినుండి రేబాలవారు, కాకినాడ నుండి మొసలగంటివారు, రాజమండ్రినుండి నాళం వారు కాంగ్రెసుకు వచ్చిరి. ఇంగ్లీషురానికొందఱు తెలుగులుకూడ లాహోరు కాంగ్రెసు చూచుటకై వచ్చిరి. పలువురుకలిసి ఒక్కటికక్కటేకొని వంతులువంతులుగా కాంగ్రెసుడేరాలో ప్రవేశించి విడ్డూరము చూచువారు. చాలకాలము సొంతడేరాలో ఏమేమో హస్కుకొట్టువారు. బెనారెస్‌నుండి వచ్చిన ఆంధ్రవిద్యార్థులీవేళలలో కులాసామాటలలో పాల్గొనువారు. నేను పెషావరువరకు పోదుననినపుడు నలుగురాంధ్రులు నావెంట బడిరి. వీరిలో మొదటివాడు రాజమండ్రి కాపురస్థుడు నాళంభీమరాజు. ఇతడు నిర్మలహృదయుడైన దేశభక్తుడు. వైశ్యకులమునకు వన్నెదెచ్చిన యువకుడు. చదువునకై కలకత్తా వచ్చి నాకడ కొన్నాళ్లుండుటచే నితడు నాకు పూర్వపరిచితుడు. రెండవవ్యక్తి విశాఖపట్టణమునకు సమీపమందలి చోడవరమునుండి వచ్చిన వాడపల్లి బ్రహ్మన్నశాస్త్రిగారు. తక్కిన యిరువురు ఇచ్ఛాపురమునుండి వచ్చినవారు. ఒకడు తూములకృష్ణమూర్తియను వైశ్యరత్నము; రెండవవాడు పట్టుసాలికులస్థుడు దున్నారామమూర్తి. ఇతడింగ్లీషు నెరుగడు. కాంగ్రెసుఏమో చూడవలెనని పరుగెత్తుకొనివచ్చినాడు. ఫ్రాంటియరుమెయిలు లాహోరులో రాత్రి ఏడుగంటలకు బయల్దేరును. మేమాఱుగురము (ఆఱవవాడు పొట్టిపిచికి) ఆరైనపిదప మాడేరాను విడిచి అవ్వలి కరిగితిమి. "లజపతి నగర"ద్వారమున స్టేషన్ వఱకు రెండుటాంగాలు కట్టించుకొనదలచితిమి. "పంతులుగారూ! వీరితో మీ రిందు నిలువుడు" అనిచెప్పి భీమరాజు ముందులకరిగి "టాంగావాలా! టాంగావాలా!!" అని యఱచినాడు. టాంగావచ్చులోపల ఆతనిజేబు చులకనైనది. అందున్న మనీపర్సు నెవ్వరో లాగివైచిరి! అందు చాల నోట్లున్నవట. కాంగ్రెసుసమయము కావున జనులు ఇసుకవేసిన రాలనట్లున్నారు. పోయినపర్సు ఇక లభించుననుట కల్ల. టాంగాలువచ్చునని మేము నిలబడియుంటిమి. భీమరాజుమాత్రమువచ్చి పర్సుపోయినసంగతిని చెప్పినాడు. ఆతనినష్టమునకు మిక్కిలి వగచితిమి. పోలీసులతో చెప్పితిమి కాని పోయినడబ్బు మరల లభించలేదు. ఇట్టిదుశ్శకునముతో ప్రయాణము సాగించుట కిష్టపడక నాటికి డేరాలోనికి మరలిపోతిమి. మఱునాడు నేనూ, బుడంకాయా పయనమైతిమి. భీమరాజు తనపయనము మానుకొన్నాడు. తక్కినముగ్గురు నావెంట బడిరి. వీరితోగలిసి నేనుసలిపిన ప్రయాణమును గుఱించిన విపులోదంతము నా "కాశ్మీరమజిలీలందు" కాలక్రమమున వివరింతును. ప్రస్తుతము మనదృష్టియందలి విషయమును దృష్టాంతీకరించుటకుమాత్రము అప్పటి ప్రయాణాంశముల గొన్నింటి నిం దుల్లేఖింతును.

పైన తెలిపిన ముగ్గురు మిత్రులు నాతో† పెషావరునుండి కైబరుకనుమయవ్వలివఱకు వచ్చిరి. కాశ్మీరమునకు కూడ పోదునని నా ప్లాను వారికి దెలిపితిని. "మేముకూడ నచ్చటికి వత్తుము. హిందీకాని, పంజాబీకాని, కాశ్మీరీకాని మాకురాదు. ఒంటరిగా గాక మీతో పయనముసాగించిన, మాకెంతేని మేలుకలుగును. మా అంతకు మే మచటికి పోలేము." అని పలికి వారు.

---

* ఇతనిపేరు 'రావు'; కొంతకాలము మదరాసులోనున్నాడు. పదంపడి బొంబాయిపోయినాడు. కడచిన డిశంబరులో నన్నందు కలిసికొని "బొంబేక్రానికల్" ఆఫీసులో నుంటి నని తెలిపినాడు.

† "నాతో" అనినపుడు నాకూడ నాపొట్టిపిచికిగాడుకూడ నున్నాడని చదువరులు గ్రహింతురు గాక! నా యనుచరుడైన బుడంకాయగాడిని గుఱించిన వృత్తాంతమును నా "కాశ్మీరమజిలీ" లందు వారుచూచియుందురు.

ముువ్వురు నావెంటబడిరి. నాతో తక్షశిలయందు విడిసి, అందుండి రావల్పిండి వచ్చిరి. రావల్పిండిలో "దాల్ మండీ" యను చోటున నానక్‌సింగ్ అను సిక్కు మిత్రునింట గొంతకాలముండి, పదంపడి శ్రీనగరమునకు పయనమైతిని.

రావల్పిండికి నలుబదియైదు మైళ్ళదూరములో మర్రే అనుచోటు కలదు. పంజాబు గవర్నమెంటువారిందే వేసవిసమయమున వసింతురు. హిమగిరిపై నిది మిసుల నెత్తయినప్రదేశమం దుండుటచేతను, మే మచటికి జనవరిలో పోవుటచేతను, ఆచోటంత మంచుతో నిండియుండెను. కాశ్మీరప్రభుత్వమువారిచే నియోగింపబడిన నౌకరులు బస్సుపోవుత్రోవనుండి మంచుమ త్రవ్వి, పథపార్శ్వమున ప్రోగొనరింతురు. అచటి యిండ్లన్నియు నొత్తుగ పిండిముద్దలతో కప్పబడినట్లు మంచుముద్దలతో గప్పబడియుండెను. బస్సుపోవుతటి చేయిజాపగనే నిమిషములో నది తెల్లబడిపోయెడిది. ఇచటికి రమారమి యిరువది మైళ్ళలో "కోహలా" అను చిన్నకొండపల్లె కలదు. ఈపల్లె జీలమ్‌నదియొడ్డున నున్నది. మే మీపల్లెను చేరుసరికి రాత్రి రమారమి యెనిమిదిగంటలసమయ మైనది. హిమగిరియాత్రలో రాత్రులందు కొండలందు పలుమారు విడియుచుండు వారము. అప్పటియనుభవములు అత్యద్భుతమైనవి. నాటికి "కోహలా" యందు విశ్రమించి మఱునాడుద యమున బయనమగుదమని చెప్పి మాబస్సు డ్రైవ రెందో అంతర్ధానమైనాడు. బస్సు ఆగగనే ఒక కాశ్మీరీ యువకుడు చరచర మాకడకు వచ్చినాడు. ఆతని మేని చాయ దబ్బపండురంగును ధిక్కరించుచున్నది. అతడు దట్టమైన లాంగ్‌కోటును ధరించినాడు. వాని తలపై చక్కనిటోపీ అలరారుచున్నది. బస్సులో నున్న నన్నుచూచి "బాబూ సాబ్! ఆయియే. మై ఆబ్‌కా తాబేదార్ హూం" అనినాడు. ఈ యాహ్వానము నాకెంతో ఆనందము గలిగించినది. రామనవమి యుత్సవములు చూచి, భద్రాచలమునుండి రాజమండ్రికి యాత్రికులు తిరిగివచ్చునపుడు, పోలవరంకడ ఇసుకతిప్పలలో కొన్నిపందిరులువేసి పుణ్యాత్ములు కొందఱు వారిని ప్రేమపూర్వకముగ నాహ్వానించి భక్ష్యభోజ్యలేహ్యచోష్యములతో వారిని తనుపుచుందురు. ఇట్టి యేర్పాటు చేయుచున్నదో లేదో యెఱుగను గాని ౧౯౨౨ లో నుండెడిది. వినయపూర్వకముగ హిమగిరిపల్లెయందు మమ్మాహ్వానించిన కాశ్మీరీయువకుని జూచి మంచుకొండపై మాకాతిథ్యమీయ నవతరించిన గంధర్వబాలుడని యూహించితిని. అపూర్వమైన విందు చేయుమని ఆశపడితిని. "చలియే!" అని చెప్పి మిత్రులతో నేనాతని వెంటబడితిని. చలి చెప్పనలవిగానట్లున్నది. అక్కఱకైన శీత వస్త్రములు శరీరముపైనున్నను, అంతరంగమునుండి దారుణమైనచలి యొడలిని గజగజ ఊపుచుండెను! అచిరములో మే మాయువకునియింటి కరిగితిమి. మ మ్మాతడు వేర్వేరుకుర్చీలపై నాసీనుల గావించి ముంగల గల బల్లలపై వేడినిప్పులతో నింపిన కుంపట్ల నుంచినాడు. శీతనగమున పయనము సలుపుతటి రాత్రులందు అనివార్యముగ అగ్నిసమీపమున సమయము గడపవలెను. రాత్రులందు కొండపల్లెలందు విడియుతటి గదికిని మంచమునకును అగ్నికిని ప్రత్యేకముగా బాడుగనీయవలెను. అగ్నిదర్శనమువల్ల మేము "అమ్మయ్యా!" అనుకొన్నాము. "తమకు పూరీకావలెనా, కచోడీ కావలెనా, ఫుల్కా కావలెనా, పరోటా లేక చపాటీ కావలెనా? సెలవీయుడు" అని కాశ్మీరీయువకుడు నన్నుద్దేశించి పలికినాడు. "ఇవన్నీ రొట్టెరకములు. మీ కేమి కావలెనో చెప్పండి" అని తెలుగుసోదరుల నడిగితిని. ఇంతలో పొట్టెపిదికి "గర్మాగరం చపాటీ లియావ్" అని హుకుమ్ జారీచేసినాడు. నిమిషములో వేడివేడి చపాటీలువచ్చి మాముందు వ్రాలినవి. "మలాయిభీ లీజియేగా?" ("మీగడకూడ తీసికొందురా?") అని యువకు డడిగినాడు. వానిప్రశ్న ముగియకమున్నే "అల్‌బత్" (తప్పక) అని బుడంకాయగాడు అఱచినాడు. మీగడతోను, కోపీ లేక గోబీ (కేబేజ్) ఆలూ (బంగాళాదుంప) మటర్ (పచ్చిబొటానీగింజలు) కలిసిన చక్కనికూరతోను చపాటీలను కడుపునిండా మెక్కితిమి. "దూద్‌భీ లీజియేగా?" ("పాలుకూడ దీసికొందురా") అని యువకుడు మరల ప్రశ్నించి

నాడు. "జరూర్!" అని పొట్టిపిచికి పలికినాడు. అర్ధ సేరు ప్రాప్తికి అందరము పంచదార కలిసిన వేడివేడి పాలు పీల్చి "అమ్మయ్యా!" అనుకొన్నాము. "ఏం పుణ్యాత్ముడండి! జగదీశు డిట్టివానికే సకలైశ్వర్యము లిచ్చును. మే మిలాపలికితిమని ఆ పెద్దమనిషికి తర్జుమాచేసి చెప్పండి" అని బ్రహ్మన్నశాస్త్రిగారనిరి. నే నట్లే తెలిపితిని. "అబ్ కా మెహర్ బానీ" అని యతడు బిల్లుతెచ్చి మాముందుంచి "పాఞ్ భీ లియావుంగా" అని చెప్పి వెంటనేపోయి, తాంబూలము తెచ్చి మా కిచ్చినాడు. బిల్లులో నైదురూకల మొత్తమున్నది. "ఏమి చెప్మా?" అనుకొని, తోడనే "మాకింత సత్కారము చేసి మా యుదరములను నిండించిన పెద్దమనిషి ఒక హోటలుకీపరుగాని మనుష్యులను తనుపుటకై గంధర్వ లోకమునుండి దిగివచ్చిన వరూథిని తమ్ముడు కా"డని గుర్తించి దానిని, కూడనున్న మహాశయులచేతి కిచ్చితిని. బిల్లును చూచినంతనే వారు తెల్లబోయిరి. కత్తితో వ్రేటువేసినను వారి మొగములనుండి రక్తపుచుక్క పడునని తోచలేదు. నిమిషమునకుమున్ను ఆతని నెంతో పొగడిన బ్రహ్మన్నశాస్త్రిగారు "హారి వీడి మొహామ్మండా! అయిను రూపాయలే! కొంప తీశాడు ఉండి ఉండి!" అని గుండె చఱచుకొని అఱచినాడు. "మనిషి ఒక్కంటికి రూపాయియైనది. పొట్టిపిచికిగాడిఖర్చును నేనే భరింతును. కావున నేను రెండురూక లిత్తును. రూపాయిచొప్పున మీరు మీ పైకము వానికీయుడు" అని నేను పలికితిని. "ఇప్పు డేమనుకొంటే యేమిలాభం యిచ్చివేయండి" అన్నాడు రామమూర్తి. "ఇటువంటి డిమేండు తలపైబడునని కలలోనైన తలచియెఱుగను. హిమగిరి తలపై పడినట్లయింది. నేను పుట్టి పెరిగి రమారమి యేభై యేళ్లు కడపినాను. ఒకపూట తిండికి (అందులో అన్నమూ లేదు, వీడి పిండాకూడూ లేదు) రూపాయి నేనెన్నడూ యిచ్చియుండలేదు. ఈడబ్బు వీడికి దక్కయేశుష్టుం దేమి?" అని విసుకుకొనుచు బ్రహ్మన్నశాస్త్రి గారు రొంటినుండి తమ రూపాయను దీసి క్రింద గిరవాటు వేసిరి. "ఈలా అని పంతులుగారు ముందే చెప్పియుండవలసింది. మాటరాకపోవడంచేత ఇంతపని జరిగిపోయింది. వీడు ఏమిపెట్టినాడని రూపాయి యిచ్చేది! చివరికి ఒక్క పెసరట్టయినా కళ్ళబడింది కాదు. నోరంతా చచ్చి కూర్చుంది. చూసి చూసి వీనికి రూపాయి నే నియ్యను. నా కింకా చపాటీలు తెప్పించండి" అన్నాడు కృష్ణమూర్తి. మా ధోరణి యేమో కాశ్మీరీయువకునకు తెలిసినది కాదు. "క్యా చాయియే ఫర్మాయియేగా" అని ఆతడనినాడు. "ఉనోక్ ఫిర్ చపాటీ దీజియేగా" అని నే నంటిని. వడివడిగపోయి నాలుగు చపాటీలను తెచ్చి అతడు కృష్ణమూర్తిముందుంచినాడు. "చేతులు కడుగుకొన్న నేమి? మేమేల అడుగరాదు?" అని తక్కిన మహాశయులు తమలో తాము యోచించుకొనిరి. ఇంతలో మఱొకబిల్లుతెచ్చి "అఫుర్ ఆఠ్ అణా దీజియే" అన్నాడు యువకుడు. "మఱి ఎనిమిదణా లీయమంటున్నాడు" అని కృష్ణమూర్తితో చెప్పితిని. "ససేమిరా!" అనినాడాతడు. "అల్లరెందుకు పాఱ వేయండి" అని నే నంటిని. "పీల్చివేశాడు వీని దుంప తెగా" అని బ్రహ్మన్నశాస్త్రిగారనిరి. "ఇంతఘోరమా! ఇంత దారుణమా! ఈ డబ్బుతో ఎంతమందికో సంతర్పణచేయవచ్చునే!" అని సణుగుచు, తిట్టుచు కృష్ణమూర్తి పైకము చెల్లించినాడు. "పరుండుటకు మాకు చోటెందు లభించును?" అని నేను యువకుని ప్రశ్నించితిని. "కొంతదూరంలో ఒక డాక్‌బంగ్లా యున్నది. అచట కావలసినంత చోటుండును. ఇక్కడ చోటులేదు. ఇష్టమైతే ఈ బల్లమీద ఒకరిద్దఱు పరుండవచ్చును. కాని యిచ్చట చలి అధికము" అని ఆతడనినాడు. ఇచ్ఛాపురపు మిత్రులందే యుండదలచిరి కాని 'నిద్రచేసి'నందులకు మరల పైక మీయవలసి వచ్చునని అడలిరి. మఱెచ్చటికీ రాలేమని ప్రక్కనున్న దుకాణములో చతికిలబడిరి. నేను వెలుపలి కరిగితిని. పొట్టిపిచికీ, బ్రహ్మన్నశాస్త్రిగారూ నావెంట బడిరి. "ప్యాఞ్ కా పైసా దీజియే" అని హోటలువాడు శాస్త్రీజీచేయి పట్టుకొన్నాడు. "ఏమండో, కీడేమో అంటున్నాడు. కొడతాడు కాబోలు వీడి మొహామ్మండా! అమాంతంగా జెబ్బపట్టు

కొన్నాడు!" అని శాస్త్రిగారు మొరపెట్టిరి. వెనుకకు తిరిగి సంగతినెఱిగి, కిళ్లీలకైన డబ్బులు యువకునికిచ్చి ముందులకరిగితిని. "బంగ్లా బాగా యెత్తుచోటుననున్న" దని అచటివారన్నారు. కారుచీకట్లు నలువైపులందు అలముకొనియున్నవి. త్రోవా, తెన్నూ కానుపింపలేదు. ఎత్తుపల్లములూ, ముళ్లూ, మంచుగడ్డలూ మమ్మేను ర్కొనినవి. ఎట్లో నేనూ, బుడంకాయగాడూ ముందుల కెగబ్రాకితిమి. ఇక బ్రహ్మన్న శాస్త్రిగారు!

లాహోరులోనే ఈయన బావాజీవలె తయారైనారు. ఈయన యెఱ్ఱపంచలే వాడుచుందురు. ఒంటికి చొక్కాలేదు, కాలికి జోడులేదు. మెడలువంచి "పిండీలో" ఈయనచే ఒకరగ్గు కొనిపించినాను. "చొక్కాకుట్టించుకొను" డంటే "ఊహూ!" అని మాతిపొడిగించారు. "కాలికి జోడుతప్పదు. జోడు లేకున్న నీప్రాంతాలలో నలుగురూ నవ్వేదరు. అదట్లుండ జోడులేనిదే మంచులో తిరుగరాదు. ఐదునిమిషాలలో ప్రాణము లెగిరిపోవును" అని చెప్పితిని. నానక్‌సింగూ, అతని సోదరులూ అట్లే చెప్పిరి. ఎట్టకేలకు ఒక చవుక రకపుజోడు కొనుటకు శాస్త్రీజీ అంగీకరించారు. పొడవుపాటి యెఱ్ఱని తురకజోడును కొన్నారు. జోడు నంతకుమున్ను వాడని పెద్దమనిషియగుటచేతను, ఆజోడుతోలు రాతికంటె గట్టిదగుటచేతను శాస్త్రీజీ దానిలో పాదములు దూర్చి చాల బాధపడువారు. "రామా! ఇది కుక్కపీకినట్లు పీకుతోందండీ!" అని ఆయన అనుచువారు.

నేనూ, పొట్టిపిచికీ ముందులకరుగుచు "త్వరగా రరడీ" అని శాస్త్రీజీని హెచ్చరించితిమి. పాపము ఆయనబాధ వర్ణనాతీతము. బిక్కుబిక్కుమంటూ జోడుతో ముందుల కడుగువేసి "రామా హరీ!" అని కెవ్వున కేకవేసి, దానిని తీసివేసి మంచులోనూ, ముండ్లలోనూ అడుగువేసి "అమ్మో! చచ్చేను!" అని బహుకష్టముతో మరల జోడుతొడిగి, కాలుసాగించి "హరహరా" అని ఆయన ప్రక్కగోతిలో పడిపోయిరి! మేమిద్దఱమూ వెనక్కు వచ్చితిమి: "చంపేశావయ్యా బ్రాహ్మడా! ఇక్కణ్ణుంచి రావడమెల్లా? జోడుతొడిగితే ఒకతంటా, తొడగకపోతే మఱొకతంటా! ఈ కాశ్మీరము నన్ను చంపేందుకు పుట్టిందికాబోలు! ఈ పర్వతాలూ, యీ మంచూ, యీ ముళ్లూ నాహతమార్చి తీర్తాయి!" అని ఆయన గద్గదస్వరముతో మొరపెట్టినారు. నాగుండె నీరైనది. పొట్టిపిచికి పకపకనవ్వుచు గంతులువేసినాడు. "శాస్త్రీజీని ఇందుండి కదపుటెట్లు?" అని పరిపరివిధముల దలపోసితిని. ఇద్దఱమూ పట్టి పైకి కొనిపోవుదమనినను, అతను స్థూలకాయుడుగాని బెండువంటివాడుకాడు. ఎక్కవలసినది ఎత్తుకొండయగుటను, దాపలనున్నది లోతులోయ యగుటను, అట్లొనరించుట అసాధ్యమని గ్రహించితిని. ఆయనచే మరల కష్టంమీద జోడుతొడిగించి, మెల్లగ చెరియొకవైపునుండి చెరియొక చేయిపట్టుకొని ముందుల కడుగువేయించితిమి. బుడంకాయిగాడి నవ్వు హెచ్చినకొలది శాస్త్రీజీ ఆగ్రహం హెచ్చినది. "తెల్లవారనియ్యి నిన్ను తవ్విపాతివేస్తాను" అని ఆయన అనుచువాడు. ఎట్లో శాస్త్రీజీతో మేము డాక్‌బంగ్లాను చేరుకొన్నాము.

మే మచటికి పోవునప్పటికి బంగ్లానుండి యెవ్వరో ఒక హిందూస్థానీయుడు చివాలున నీవలికి వచ్చినాడు. యూరపియన్ డ్రెస్సుతో అతడు అలరారుతున్నాడు. "మీ రెవరు? ఇచ్చటికేలవచ్చితిరి?" అని అత డనినాడు. అతని కంఠస్వరము తీవ్రముగా నున్నది. "అయ్యా! మే మీ రాత్రి యిచ్చట పరుందుము. ఉదయమే లేచిపోదుము" అని నేను తెలిపితిని. "ఇచట చోటులేదు పొండు" అని అత డనినాడు. "లోపల చోటులేకున్నను, మే మీ వసారాలో నొరుగుదుము. ఇందు కావలసినంత చోటున్నది కదా!" అని నేనంటిని. "తావు ఇందూ లేదు, అందూ లేదు. వెంటనే పొండు" అని అత డనినాడు. నేను హిందీలో ప్రసంగించుచుండ నతడు ఇంగ్లీషులో మాట్లాడసాగినాడు. నేనుకూడ ఇంగ్లీషులో ప్రసంగము మొదలిడి, నా ధోరణిలో కొంత స్టీమ్ ఎక్కించితిని. "ఏమోయీ! నీవు మానవునివలెనే అగపడుచున్నావు. అందును భారతీయుడవు. నీ కిట్టి నిష్ఠురము కూడదు. నిన్ను మేము కోరిన దేమియులేదు. దక్షిణ సీమనుండి

వచ్చి, కాశ్మీరమునకు పోవుచు, ఈ రాత్రి యిందు చిక్కుబడిపోతిమి. ఈ స్థితిలో వన్యమృగములయిన మాకు చోటిచ్చుట కంగీకరింపుము. మనుష్యరూపమున నున్న నీ నోటినుండి ఇట్టి నుడువులు వెడలుట శోచనీయము" అని పలికితిని. "ఎంతచెప్పినను, మిమ్మిందు పండనీయను" అని ఆతడు ెప్పటిపాటను పాడినాడు. "నీవు నూఱుచెప్పుము. వేయిచెప్పుము. మేమిందే తిష్ఠ వేతుము. నీ యిచ్చవచ్చినచర్య జరపుకొనుము." అని "శాస్త్రీజీ! సంశయింపక మీరు ప్రక్క వేయుడు" అని పలికితిని. తాను తెనుగున మాట్లాడిన నచటి హిందూస్థానీయునకు బోధపడదని శాస్త్రీజీ యెఱుగును. "ఈపిశాచము మనలను మ్రింగివేయునేమో! వీనితో మనకు పోరాట మెందులకు?" అని "పరుండు" డని నేను గద్దించినంతనే నేలపై మేను వాల్చినారు. "మనము మనుష్యులము. ఈతడు ప్రస్తుతము పశువైనాడు. పశుబలముకంటె మనుష్యబల మధికము. ఏచింతలేక నిద్రింపుడు. హిమగిరిని విలోకించుచు నే నీరాత్రి మేలుకొని యుందును. మీకేమియు భయములేదు." అని శాస్త్రిగారికి ధైర్యము చెప్పితిని. హిందూస్థానీయు డవాక్కయి నిలిచినాడు. "నీవు మహత్తరమైన భారతభూమియందు పుట్టుటకు తగవు. 'అతిథిదేవో భవ' అను పవిత్రవాక్కు ఈ దేశమందు ముఖ్యముగ, నొకప్పుడు మునిపుంగవులకు, దేవతలకు నిలయమైన ఈపర్వతప్రదేశమందు ప్రతిధ్వనించినది. నీవు నీహృదయము నెందు పీడితివో యెరుగను. ఈ బంగ్లాకు సంబంధించిన నిబంధనపత్రమును గొనిరమ్ము. మర్యాదనేకాక, రూలునుకూడ నెఱుగని మూర్ఖుడవువలె నగపడుచున్నావు. నీపైచర్య దీసికొనిన నీ యుద్యోగము ఊడి నేలరాలును. నీ కపకారము చేయను గాని నీకు హితవు చెప్పుదును. మేము దొంగలము కాము. ఇందుండి నీవు మమ్ములను క్రిందికి దొరలింప దొరకొనినను, మేము కదలువారము కాము. ఈగహనమున మాకు మరొకతావు లభింపదని నీవుతొలుతనే గ్రహించి యుండవలసినది" అని హిందూస్థానీయు నుద్దేశించి పలికితిని. ఏమనుకొనినాడో కాని ఆత డిక మాట్లాడ లేదు. నా యాదేశానుసారము పొట్లిపిచికిపోయి శాస్త్రీజీప్రక్క పరున్నాడు. కొండమీది యల్లరి విని ఎవరో ఒకపెద్దమనిషి బంగ్లాలోనికి చరచర వచ్చినాడు. మనిషి చామనచాయవాడు. దట్టమైన బట్టలు ధరించినాడు. "కథయే" మని నన్నడిగినాడు. జరిగిన ఉదంతమును వానికి పూసగ్రుచ్చినట్లు చెప్పితిని. అతడు మిగుల నక్కజంపడి రాతిప్రతిమవలె నిలిచిన హిందూస్థానీయు నుద్దేశించి "నీ వెంతేని దుర్నయమున కొడిగట్టితివి. సిగ్గుచే, దుఃఖావమానములతో మనము తలలు వంచుకొనవలెను. ఈయన దాక్షిణాత్యుడు. విద్యాబుద్ధులందు దాక్షిణాత్యులు మన తలదాటినారు. వారు మనకు పూజనీయులు. ఉత్తరహిందూస్థానమునుండి పోయినవారిని వా రెంతో గౌరవింతురు. వారుచూపు ఆదరణమునకు బదులుగ నీ వత్యాచారము జూపితివి" అని పలికి ముఖము వాచునట్లు వానికి చీవాట్లు పెట్టినాడు. పశ్చాత్తాపము నంది ఆ హిందూస్థానీయుడు క్షమింపుడని నన్ను వేడుకొనినాడు. నా కన్నులనుండి నీరు జొటజొట రాలినది. గంగాస్రవంతివలె నా హృదయమున నత్తఱి పూతభావపూర ముప్పొంగినది.

ఆహా! మనుష్యాత్మకు మహదానంద మొసగునది మహత్తరమైన ప్రణయభావమేకదా! మనుష్యహృదయము నేలునదీభావమేకదా! అపుడపుడు దుశ్చింతలు రాబందులట్లు మనసుపై వ్రాలుట నిక్కమే! క్రోధభావము ఝంఝామారుతమట్లు హృదయము నట్టిట్టు లాడించుటయు నిక్కమే! క్రోధముచే ఘూర్ణితచిత్తుడైన వ్యక్తి దురుక్తులాడుట నిక్కమే! దుష్క్రియలకు దొడరుటయు నిక్కమే! కాని క్రోధముగాని, మఱే ప్రతికూలభావముగాని మనుష్యాత్మకు సహజములు కావు. సహజములుగాని వరు వెంతకాలము నిలుచును? దేవదేవుని పీఠస్థలియైన మనుష్యహృదయమున పిశాచము కాపురముండ నేర్చునా? జగచ్చక్షువు ప్రోల కారుచీకటి భామవలె నృత్యముచేయజాలునా? మనుష్యహృదయమున దివ్యశంఖారవమట్లు పవిత్రప్రేమవాక్కు ప్రతిధ్వనించినంతనే దొంగపగిది క్రోధమందుండి కాలికొలది పాఱిపోదా? కొంతసేపు హిందూస్థానీ

యుడును, నేనును పోరాడుకొంటిమి. ఆత్మరక్షణము కొఱకు, చెంతనున్న మిత్రులకు రక్షణమొసగుకొఱకు నేను కొంతనాటక మాడితిని. సంయమిని కానుగాని క్రోధభావమును హృదంతరాళమున గాపుర ముండ నీయక దానిని తఱిమికొట్ట నాతురంపడుదును. కాని మెత్తనివానిని చూచిన మొత్తువారెందు రగునపుడు అస్త్రసన్న్యాసము అనర్థహేతువగుతఱి, కాలపరిస్థితులు కురుసేనలట్లు మార్కొనినపుడు ముప్పునుండి దాటుటకై కొంత ధూమధామముచేయుచు, ఎదుటిపగతుని మిత్రుని గావించుకొనుటకై వేయివెరవులు రోయుచుందును. నాకు మిగులగూర్చు మిత్రులలో పలువు రొకప్పుడు నన్నెదుర్కొనినవారే! నాటి హిందూస్థానీయుడు పదంపడి నాకు ప్రాణమిత్రుడైనాడు. హిమగిరియాత్రయందు నా కత డెంతో సాయము సలిపినాడు. ఈతని పరిచర్యనుగుఱించిన విపులోదంతమును చదువరులు వేఱుగ్రంథమున గాంచగలరు. పొట్టిపిచికి తొలుత నాశత్రువేకదా!

ప్రణయభావసేచనముచే నాటిరాత్రి మమ్ముల నానందపూరమందు ముంచిన ఆనూతన ఆగంతువునకు మేము ధన్యవాదము లొసగితిమి. అతడు కురుక్షేత్రమందు అధ్యాపకవృత్తిలో నుండెను. "కొంత సొంతపనిమీద కోహలోకు కొన్నాళ్లకుముందే యరుదెంచితి" నని ఆతడు పలికినాడు. ఆతనిపేరు చిరంజీవి. నేనుత్తరహిందూస్థానమును వీడివచ్చినయనంతరము ఆతడును, నాటిహిందూస్థానీయుడును తఱచుగ జాబులు వ్రాయుచు, నా యోగక్షేమము లరయుచున్నారు. దాక్షిణాత్యమునకు రండని వీరికి పలుమాఱు వ్రాయుచుందును. ప్రేమఋణమును దీర్చుకొను నవకాశములకై పొంగులుచుందును.

"పరుండుటకు మీకిచట సౌకర్యము లభించదు. ఈ చలికి మీరు గుజికారాదు. మీకు వలసిన సదుపాయములను నేనొనగూర్తును. నా కూడ రండు" అని ప్రొఫెసర్ చిరంజీవి నాటినిశీథమున నాతో సాదరపూర్వకముగ పలికినాడు. "మంచి" దని నెచ్చెలులతో కలిసి మెల్లగ నాతనివెంట నరిగితిని. తరువాతియుదంతమును పాఠకులు పదపడి తెలిసికొనగలరు.

హిమశైలమున, నాడు తారసిల్లిన హిందూస్థానీయునకు నాసికజేరుతఱి నాకగపడిన నాగపురవ్యక్తి తమ్ముడేమోయని యూహించితిని. చదువరులీతని గాలక్రమమున మరల గాంచగలుగుదురు; నెచ్చెలియయ్యోనని ఆనందింపజాలుదురు.

నా డాత డదృశ్యుడైనంతన తెరువున, చలిలో నేనట్లే నిలువంబడి పోతిని.